పెండింగ్ పనులను పూర్తి చేయాలి



పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ ప్రేమ్‌దాస్ మఠ్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నిర్మాణంతో పాటు ఇతర పలు సమస్యలను, పలు అభివృద్ధి పనులను నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం మినీ ఇండియా అని, ఈ ప్రాంతంలో పలు సమస్యలు ఉన్నాయని వీటిని పూర్తి చేయాలని వివరించారు. పుత్లీబౌలి నుంచి అఫ్జల్‌గంజ్ వరకు, ఎంజే మార్కెట్ నుంచి భూలక్ష్మి ఆలయం వరకు బోయిగూడ కమాన్ నుంచి పురానాపూల్ గాంధీ విగ్రహం వరకు రోడ్డు వైడెనింగ్ చేయాలన్నారు. నిజాం కాలం నాటి ఇరుకైన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేపడుతామన్నారు. ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపిన సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులకు వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఆనంద్‌కుమార్ గౌడ్ ఇచ్చిన మెమోరాండం ప్రకారం వేగవంతంగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

హైదరాబాద్ పార్లమెంట్ బరిలో అమర్‌సింగ్ !



ఠాకూర్ అమర్‌సింగ్

అబిడ్స్/గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా ఠాకూర్ అమర్‌సింగ్ పోటీ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. త్వరలోనే పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ టికెట్‌కు అమర్‌సింగ్ ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. పాతబస్తీ కార్వాన్ నుంచి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా ఠాకూర్ అమర్‌సింగ్ మజ్లిస్ పార్టీకి గట్టి పోటీనిచ్చి స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికలో కూడా అమర్‌సింగ్ పోటీచేసి మజ్లిస్‌కు ముచ్చెమటలు పట్టించారు. పాతబస్తీ పరిధిలోని కార్వాన్, గోషామహల్ నియోజకవర్గాలతో పాటు మిగతా హైదరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో అమర్‌సింగ్‌కు మంచి పట్టు ఉంది. ముందుగా కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్ల పాటు కొనసాగిన అమర్‌సింగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా కూడా కార్వాన్ నుంచి పోటీచేసిన అనుభవం ఉంది. దివంగత సీఎల్పీ మాజీ నాయకుడు మహానేత పీజేఆర్‌కు ప్రియ శిష్యుడు అయిన అమర్‌సింగ్‌కు పాతబస్తీలో పెద్ద ఎత్తున పట్టు ఉండడంతో మజ్లిస్‌కు గట్టి పోటీ ఇస్తారని పలువురు పేర్కొంటున్నారు. బీజేపీలో కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న అమర్‌సింగ్ తరచు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి..

కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కొనసాగుతున్న అమర్‌సింగ్ బోనాల ఉత్సవాలు పాతబస్తీలోనే అత్యంత వైభవోపేతంగా చేపడుతారు. ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అమర్‌సింగ్‌కు బీజేపీ టికెట్ ఇస్తే గట్టి పోటీ ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. పాతబస్తీలో మజ్లిస్‌కు దీటైన అభ్యర్థులను బరిలోకి దింపాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తుంది.

ఫిరోజ్‌ఖాన్ ఉంటే అమర్‌సింగ్‌కు మేలు..

గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఫిరోజ్‌ఖాన్ మరోసారి హైదరాబాద్ పార్లమెంట్ బరిలోకి దిగేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఫిరోజ్‌ఖాన్, మజ్లిస్ నుంచి అసదుద్దీన్ ఒవైసీ బరిలోకి దిగితే బీజేపీ అభ్యర్థిగా అమర్‌సింగ్‌ను బీజేపీ అధిష్టానం టికెట్ కేటాయిస్తే పోటీ రసవత్తరంగా ఉంటుంది. బీజేపీకి లాభం చేకూరే అవకాశాలు అధికంగా ఉంటాయి. సీనియర్ కార్యకర్తలు, సంఘ్ పరివార్ నాయకులు అమర్‌సింగ్‌కు టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

వార్షికోత్సవానికి ఆహ్వానం



మాధవీలతను ఆహ్వానిస్తున్న స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే తదితరులు

జియాగూడ: ఈ నెల 10న జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో జరిగే 20వ వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని విరించి హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ మాధవీలతను ఆహ్వానించినట్లు స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే తెలిపారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు యమన్‌సింగ్, బీజేపీ నాయకుడు ఠాకూర్ రఘునందన్ సింగ్‌లతో కలిసి ఆమెకు బొకే అందించి ఆహ్వానించారు. అనంతరం డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే మాట్లాడుతూ..వేడుకల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, 10వ తరగతిలో ఏ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు అవార్డు మెడల్స్ ప్రదానం, బస్తీ సంఘాల ప్రతినిధులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వైభవంగా యాదాద్రి జాతీయ నృత్యోత్సవం



ప్రతిభా ప్రహ్లాద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళాకృతి నృత్యాలయ, ద డ్యాన్స్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల పాటు రవీంద్రభారతిలో యాదాద్రి పేరిట నిర్వహిస్తున్న అఖిల భారత జాతీయ నృత్యోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నృత్య నిపుణుల అభినయ కౌశల నాట్య రీతులు ప్రేక్షకులను కనువిందు చేశాయి. సుప్రసిద్ధ భరతనాట్య నిపుణురాలు ప్రతిభా ప్రహ్లాద్ మహాగణపతి అంశాన్ని, వందే వాసుదేవం, నాద హరే, కపిలగీతి, మోయిని యాట్టం వంటి పలు అంశాలపై ఢిల్లీ, కేరళకు చెందిన కళాకారుల నృత్యాలు నాట్య ప్రియులను సమ్మోహన పరిచాయి. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ ఉభయ తెలుగు రాష్ట్రాల కమిషనర్ జీవన్‌లాల్, ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ ఎస్.రవిశంకర్ నారాయణ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, ది డ్యాన్స్ ఇండియా సంపాదకులు విక్రమ్‌కుమార్, కళాకృతి నృత్యాలయ డైరెక్టర్ ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు.

10,11 తేదీల్లో ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 10, 11వ తేదీల్లో రాష్ట్ర ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ జరగనుంది. లాల్‌బహదూర్ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో టాప్–2లో నిలిచిన వారు వచ్చే నెలలో పుణేలో జరిగే జాతీయ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగలవారు తమ పేర్లను ఈనెల 8వ తేదీలోపు www.chesstelangana.com వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలి. స్పాట్ ఎంట్రీలను స్వీకరించరు. ఇతర వివరాలకు 73375 78899, 73373 99299 లలో నిర్వాహకులను సంప్రదించాలి.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేయాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మధుయాష్కీ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేయాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థ అనేది ఒక దుర్మార్గమైన వ్యవస్థ అని మండిపడ్డారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని మాట ఇచ్చారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రదు చేసే విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకువెళ్లి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు త్వరలోనే శుభవార్త చెబుతామని హామీ ఇచ్చారు. ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఒక మండలిని ఏర్పాటు చేశారని, అదే తరహాలో తెలంగాణలోనూ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న, ఏజీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సౌజన్య, జేఏసీ ప్రధాన కార్యదర్శి బి.గోవర్ధన్, కోశాధికారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేద్దాం

ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్





వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్

నాంపల్లి: మాదకద్రవ్యాల వినియోగం లేని నియోజకవర్గంగా నాంపల్లిని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఏ.ఎం.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' వాకథాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం సాయంత్రం మల్లేపల్లిలోని బడే మసీదు వద్ద ప్రారంభమైన వాకథాన్ అల్‌సబా హోటల్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ వాకథాన్ జ్యోతిని వెలిగించి ప్రారంభించి ప్రసంగించారు. యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి అందరూ కంకణబద్ధులు కావాలని కోరారు. యువత భవిష్యత్తు కోసం సంఘటితంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏ.ఎం.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముఖరం అలీ సిద్ధిఖీ మాట్లాడుతూ..ఎయిమ్స్ చేపట్టిన సర్వే ప్రకారంగా ప్రతి ఏటా ఏడు కోట్ల 21 లక్షల మంది డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నట్లు చెప్పారు. వీరిలో ప్రతి ఏటా 700 మంది మృత్యువాతపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్‌కు యువత ఆకర్షితులు కాకుండా అవగాహన పెరగాలని కోరారు. డ్రగ్స్ నివారణపై అవగాహన కోసం సదస్సులు, ర్యాలీలు చేపట్టాలని సూచించారు. పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డ విషయం తల్లిదండ్రులకు కూడా తెలియడం లేదని, తమ పిల్లలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు, హుమయూన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్‌లతో పాటుగా పలువురు ఎంఐఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. వాకథాన్‌లో వందలాది మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏ.ఎం.ఆర్. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముఖరం అలీ సిద్ధిఖీ సమన్వయం చేశారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన దేవర శ్రీనివాస్



గోల్కొండ: కష్టపడి పని చేసే వారికి ప్రజల్లో గుర్తింపుతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. సీనియర్ బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను సన్మానించారు.

'బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ అని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు రేతిబౌలి రింగ్ రోడ్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా కురాకుల కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. బల్కా సుమన్‌కు కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని, అధికారం పోగానే ఆయన మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంటి బాబు, ఏ.చంద్రశేఖర్, అబ్దుల్ ఆమీద్, రాంకుమార్, ప్రేమ్‌కిషోర్, ఎం.రఘుపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, షకీలా, అబీబ్ తదితరులున్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 3వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కవిత ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఛత్రినాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీఎం చావునీ గుమ్మాస్ మసీదు ప్రాంతానికి చెందిన షబానా బేగం (35), మహ్మద్ ఫెరోజ్ (43)లు దంపతులు. 2018 జూన్ 15న మహ్మద్ ఫెరోజ్ భార్య షబానా బేగంపై కత్తితో చాతి, కడుపు, చేతులపై గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ కేసులో తీవ్రంగా గాయపడిన షబానా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మహ్మద్ ఫెరోజ్‌ను అరెస్ట్ చేసి మంగళవారం నాంపల్లిలోని 3వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో హాజరుపరచగా..జడ్జి కవిత పూర్వపరాలను పరిశీలించి నిందితుడు మహ్మద్ ఫెరోజ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్రమబద్ధీకరణ పొందిన ఉద్యోగులకు సభ్యత్వాలు



జగదీష్ చేతుల మీదుగా సభ్యత్వ పత్రాన్ని అందుకుంటున్న సుధాకర్‌రెడ్డి

నాంపల్లి: ఉపాధి, శిక్షణా సంస్థలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తూ ఇటీవల క్రమబద్ధీకరణ పొందిన సహాయ శిక్షణా అధికారులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరంలో సభ్యత్వాలు స్వీకరించారు. టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు బి.గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి భరత్ చేతుల మీదుగా సహాయ శిక్షణా అధికారులకు సభ్యత్వాలను అందజేశారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఫోరం ఉపాధ్యక్షుడు ఎల్.సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, చాంద్ పాషా ప్రొసీడింగ్స్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి కె.రవీందర్, జిల్లా కార్యదర్శి సయ్యద్, గౌరీ, శ్రీదేవి, జ్యోతి, నాగరాజు, సుదర్శన్, ప్రవీణ్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తన దృష్టికి వచ్చిన ప్రతి చిన్న సమస్యను కూడా పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి ఫిర్యాదులను ఆయన విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో పాటు సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ప్రతి ఇంటికి నీరు అందేలా జలమండలి అధికారులతో ప్రణాళిక సిద్ధం చేశానని అన్నారు. లోప్రెషర్ నీటి సరఫరా ప్రాంతాలను గుర్తించి పలు ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హబీబ్ చౌస్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, అమీరుద్దీన్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

తహసీల్దార్‌పై ఆర్డీఓకు ఫిర్యాదు



ఆర్డీఓ సూర్యప్రకాష్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

గోల్కొండ: యాదవ సంఘం భవనాన్ని ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి కూల్చివేయడం అక్రమం, చట్టవిరుద్ధమని యాదవ సంఘం ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్ జిల్లా ఆర్డీఓ సూర్యప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఈ స్థలాన్ని కార్వాన్ యాదవ సంఘానికి ఇవ్వడం జరిగిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్‌యాదవ్, జాతీయ యాదవ కుల పోరాట సమితి అధ్యక్షులు మేకల రాములు, శెట్టి వంశీమోహన్‌యాదవ్, రాజగోపాల్‌యాదవ్, కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్ తదితరులున్నారు.

బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకం



తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముజీబ్ హుస్సేని

అబిడ్స్: బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు, టీపీసీసీ సీనియర్ నాయకుడు ఎనుముల తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మంగళవారం తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతుందన్నారు. పదేళ్లపాటు పలు రంగాల్లో బంగపడ్డ తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణగా సాధించేందుకు ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. తమ ఉద్యోగులంతా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారన్నారు. అదే తరహాలో బంగారు తెలంగాణ రాష్ట్ర సాధనకై ముందున్నారని ఆయన అన్నారు.

నవజాత శిశువు మృతితో ఆసుపత్రిపై దాడి

- సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో మూడ్రోజుల చిన్నారి మృతి
- వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆందోళన, ఉద్రిక్తత



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో మూడ్రోజుల పసికందు మృతి చెందడంతో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. గోల్నాక లంక ప్రాంతానికి చెందిన సాయికిరణ్ భార్య కవితకు నెలలు నిండడంతో ఈనెల 3న కోఠి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చేరగా అదే రోజు రాత్రి మగశిశువుకు జన్మనిచ్చింది. సోమవారం వైద్యులు శిశువుకు బీసీజీ టీకా వేశారు. అయితే మంగళవారం తెల్లవారుజామున శిశువు చల్లబడడంతో అక్కడే ఉన్న అమ్మమ్మ అనిత, మరో సహాయకురాలు వైద్యులకు తెలపడంతో వైద్యులు రాలేదని సిబ్బంది సమాధానమిచ్చారు. అప్పటికే శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తెల్లవారుజామున 4 గంటల సమయంలో శిశువు మృతి చెందాడు. రెండు రోజుల పాటు ఆరోగ్యంగా ఉన్న తమ శిశువు బీసీజీ టీకా వేయడంతోనే అది వికటించి మృతి చెందాడని సాయికిరణ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రిపై దాడి చేశారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ ముత్తు, ఎస్ఐ.కిరణ్‌కుమార్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను సముదాయించారు. ప్రస్తుతం బాలింత కవిత ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సోమవారం రాత్రి నుంచి శిశువును బాలింతరాలు, కుటుంబ సభ్యులు కింద పడుకోబెట్టి సరైన వెచ్చదనం ఇవ్వకపోగా పాలు పట్టడంతో అవి గొంతులో ఇరుక్కుని శిశువు మృతి చెంది ఉండొచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి వెల్లడించారు. శిశువు మృతికి వైద్యులు కారణమైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తా



విజేతలను అభినందిస్తున్న చైర్మన్ శైలేందర్ సింగ్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ శైలేందర్ సింగ్ పేర్కొన్నారు. ఎల్బీస్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా నేషనల్ రెజ్లింగ్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రెండు గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడల్స్, 8 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విజేతలైన విద్యార్థులను శైలేందర్ సింగ్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమ పాఠశాలలో విద్యార్థులు జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించడం ఎంతో తృప్తిగా ఉందన్నారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను బోధిస్తూ క్రీడలు, ఇతర రంగాల్లో రాణించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



అబిడ్స్: ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్శకురాలు తన పర్సును పోగొట్టుకుంది. సోమవారం రాత్రి సంపూర్ణలక్ష్మీ ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చింది. ఎగ్జిబిషన్‌లో తిరుగుతున్న సంపూర్ణలక్ష్మీ తన పర్సును పోగొట్టుకుంది. కొద్దిసేపు తర్వాత పర్సు పోయిందని చూసుకుని వెంటనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు పర్సు దొరకడంతో డబ్బులు, విలువైన విస్టింగ్ కార్డులు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్‌కు సంపూర్ణలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

'బాల్క సుమన్.. నోరు అదుపులో పెట్టుకో'



వెంకటేశ్

గౌలిపురా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోరు పారేసుకున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాల్క సుమన్‌ను నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన రేవంత్ రెడ్డిని చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. ఒక బాధ్యత కలిగిన నాయకుడిగా ఉన్న తమ సారథిపై ఇంకోసారి నోరు పారేసుకున్నా లేదా అనుచిత వ్యాఖ్యలు చేసినా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. అన్ని వ్యవస్థలను ధ్వంసం చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీది కాదా వెంకటేశ్ ప్రశ్నించారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ బుస్రా అంజుమ్

దూద్‌బౌలి: నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాలకు ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమని పురానాపూల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బుస్రా అంజుమ్ అన్నారు. పురానాపూల్ ఆస్పత్రిలో ఈనెల 12, 19 తేదీల్లో వేయనున్న నులి పురుగుల నిర్మూలన మందుల సందర్భంగా మంగళవారం సంబంధిత ప్రభుత్వ పాఠశాలలు, మదర్సా, ఆశ్రీత హోం, అంగన్‌వాడీ తదితర విద్యా సంస్థలకు చెందిన ఉపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్.విజయ్‌భాస్కర్, మహ్మద్ అబ్దుల్ నయిం, అశ్విని తదితరులు పాల్గొన్నారు.


సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయూ నేతలు



సమ్మె నోటీసు ఇస్తున్న ఆశావర్కర్లు

సుల్తాన్‌బజార్: ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో రాష్ట్రంలోని ఆశావర్కర్లు పాల్గొంటారని సీఐటీయూ ఆశా యూనియన్ నేతలు కోఠిలోని ఆర్‌ఎఫ్‌పీటీసీ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గోషామహల్ నియోజకవర్గం కన్వీనర్ కె.జంగయ్య మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎంకు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలన్నారు. 45వ ఐఎల్‌సీ సిఫారసుల ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేలు చెల్లించాలన్నారు. ప్రతి నెల పెన్షన్‌ను చెల్లించి ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రోజుకు రూ.600 పెంచాలని, జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లపై మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు ఉమాదేవి, మాధవి, అమరావతి, లలిత తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



గోల్కొండ పోలీస్ క్వాటర్స్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

గోల్కొండ: పారిశుద్ధ్య పనులపై అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉంది. క్షేత్రస్థాయిలో చెత్త తరలింపు పనులు సవ్యంగా జరగడం లేదని పలువురు బస్తీల వాసులు అంటున్నారు. గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో ఏమూల మీద చూసినా చెత్త కుప్పలే కానవస్తున్నాయి. చెత్త తరలించకపోవడంతో చెత్త కాస్తా కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. 3 నెలల నుంచి విజృంభిస్తున్న దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రధాన రహదారులు, బస్తీల మలుపులు, మినీ పార్కుల పరిసరాల్లో చెత్త యథేచ్ఛగా డంపింగ్ అవుతుంది. చెత్తను తరలించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోల్కొండ జమాలి దర్వాజను ఆనుకొని ఉన్న కందకం డంపింగ్ యార్డుగా మారింది. ఇక్కడ అధికారులు చెత్తను తరలించడం లేదు. ఈ కారణంగా ఈ దారిగుండా రాకపోకలు సాగించే వారు ముక్కుమూసుకోని వెళ్తున్నారు. అదే విధంగా జిన్సిబజార్ మినీ పార్కును ఆనుకొని ఉన్న మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కూడా యథేచ్ఛగా చెత్త డంపింగ్ అవుతుంది. గోల్కొండ పాత పోలీస్ క్వాటర్స్ వద్ద కూడా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. గోల్కొండ మోతీ దర్వాజ పరిసరాల్లో సైతం చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఎవరికి చెప్పుకోవాలో తెలియక తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో చెత్తను తరలించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.